# లక్ష్యం.. వందశాతం

- ఆస్తిపన్ను వసూళ్లపై ఫోకస్
- కూకట్‌పల్లి జోన్ లక్ష్యం రూ.346.95 కోట్లు
- వసూళ్లైంది రూ.215.50 కోట్లు
- రావాల్సిన బకాయిలు రూ.131.45 కోట్లు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 5 : జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు నిర్దేశించిన ఆస్తిపన్ను వసూళ్ల లక్ష్యాన్ని వంద శాతం సాధించే దిశగా కూకట్‌పల్లి జోన్ రెవెన్యూ యంత్రాంగం ముమ్మరంగా కసరత్తు చేస్తుంది. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఆస్తిపన్ను వసూళ్లపై ఇన్నాళ్లు దృష్టి సారించని అధికారులు వార్షిక యేడాది గడువు దగ్గరపడుతున్న నేపథ్యంలో ఆస్తిపన్ను వసూళ్లపై ప్రత్యేక దృష్టిని సారించారు. ఎర్లీబర్డ్ ఆఫర్‌లో భారీగా పన్నులు వసూళ్లైన తదనంతరం ఆస్తిపన్ను వసూళ్లు నెమ్మదించాయి. ఎన్నికల ప్రక్రియ ముగిసిన నేపథ్యంలో ఆస్తిపన్ను బకాయిదారులను గుర్తిస్తూ సకాలంలో పన్నులు చెల్లించాలని ఆదేశాలను జారీ చేస్తున్నారు. జోనల కమిషనర్ ఆధ్వర్యంలో సర్కిళ్ల ఉప కమిషనర్లు, రెవెన్యూ అధికారులు వరుసగా సమావేశాలు నిర్వహిస్తూ ఆస్తిపన్నుల వసూళ్ల లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. వసూళ్ల లక్ష్యాన్ని కచ్చితంగా చేరుకునేలా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు.

**కూకట్‌పల్లి జోన్‌లో రూ.131.45 కోట్ల బకాయిలు..**

కూకట్‌పల్లి జోన్ పరిధిలో మూసాపేట, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, గాజులరామారం, అల్వాల్ సర్కిళ్లు ఉన్నాయి. ఈ వార్షిక యేడాది లక్ష్యం ఐదు సర్కిళ్లలో కలిపి రూ.346.95 కోట్లు వసూళ్లు చేయాల్సి ఉంది. ఇప్పటి వరకు రూ.215.50 కోట్లు వసూళ్లు కాగా ఇంకా రూ.131.45 కోట్లు వసూళ్లు చేయాల్సి ఉంది.

**నెలవారీ లక్ష్యాలు..**

జోన్ పరిధిలో నిర్దేశించిన ఆస్తిపన్ను వసూళ్ల లక్ష్యాన్ని సాధించే దిశగా ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఇప్పటికే మొండి బకాయిదారులను గుర్తించి జీహెచ్ఎంసీ, రెవెన్యూ చట్టం ప్రకారం రెడ్ నోటీలను జారీ చేస్తున్నారు. ఫోన్లు, ఎస్ఎంఎస్‌ల ద్వారా సమాచారాన్ని అందిస్తూ సకాలంలో స్పందించాలని కోరుతున్నారు. లేకుంటే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరికలు చేస్తున్నారు. మరోవైపు సర్కిళ్ల వారీగా ఉపకమిషనర్ల ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బందికి నెలవారీ, రోజువారీ లక్ష్యాలను నిర్దేశించారు. దీనిలో భాగంగా జోన్ పరిధిలోని ఐదు సర్కిళ్లలో జనవరిలో రూ.43.88 కోట్ల ఆస్తిపన్నులను వసూళ్లు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ లక్ష్యాన్ని సాధించే దిశగా రెవెన్యూ సిబ్బంది బకాయిదారుల ఇంటికి వెళ్లి వెంటనే పన్నులు చెల్లించాలని కోరుతున్నారు. లేని పక్షంలో చట్టరీత్యా ఆస్తులను జప్తు చేయాల్సి వస్తుందని హెచ్చరికలు చేస్తున్నారు.

| సర్కిల్ | లక్ష్యం (రూ.కోట్లలో) | వసూలు అయినవి (రూ.కోట్లలో) | రావాల్సిన బకాయిలు (రూ.కోట్లలో) |
|---|---|---|---|
| మూసాపేట | 119.27 | 78.87 | 40.40 |
| కూకట్‌పల్లి | 100.91 | 60.17 | 40.74 |
| కుత్బుల్లాపూర్ | 057.38 | 33.15 | 24.23 |
| గాజులరామారం | 031.97 | 20.37 | 14.60 |
| అల్వాల్ | 034.42 | 22.93 | 11.49 |
| మొత్తం | 346.95 | 215.50 | 131.45 |



కూకట్‌పల్లి జోన్ కార్యాలయం

## సకాలంలో పన్నులు చెల్లించాలి..



సకాలంలో పన్నులు చెల్లించి నగరాభివృద్ధిలో భాగస్తులు కావాలని కోరుతున్నాం. జోన్ పరిధిలో ఐదు సర్కిళ్లకు నిర్దేశించిన ఆస్తిపన్ను వసూళ్ల లక్ష్యాన్ని వందశాతం చేరుకునేలా కృషి చేస్తున్నాం. ఎన్నికలు ముగిసిన తర్వాత ఉప కమిషనర్లు, రెవెన్యూ సిబ్బందితో సమావేశాలు నిర్వహిస్తూ రోజువారీ లక్ష్యాలను నిర్దేశించడం జరిగింది. మొండి బకాయిదారులకు నోటీసులు జారీ చేస్తున్నాం. ఈ నెల లక్ష్యాన్ని సాధించడంతో పాటు వార్షిక యేడాది లక్ష్యాన్ని సాధించేందుకు ప్రణాళికాబద్ధంగా పనిచేస్తున్నాం. జీహెచ్ఎంసీ సిబ్బందికి బకాయిదారులు సహకరించి వెంటనే పన్నులు చెల్లించాలని కోరుతున్నాం.

– వి.మమత, జోనల్ కమిషనర్,
కూకట్‌పల్లి జోన్

# మిద్దెమైసమ్మ విగ్రహప్రతిష్ఠాపనోత్సవం

### హాజరైన ఎమ్మెల్యే వివేకానంద్, కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ


మిద్దె మైసమ్మ విగ్రహప్రతిష్ఠాపనోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్, కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ తదితరులు

దుండిగల్,జనవరి5: మహ్మామారుల నుంచి ప్రజలను కాపాడే చల్లని దైవం మైసమ్మ అని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్‌లో వీరమల్లు కురుమసంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన 'మిద్దె మైసమ్మ' ఆలయంలో శుక్రవారం జరిగిన విగ్రహప్రతిష్ఠాపనోత్సవానికి కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణతో కలిసి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారికి వారు ప్రత్యేకపూజలు నిర్వహించారు. వేడుకల్లో మేడ్చల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రవిందర్ యాదవ్, జిల్లా గ్రంథాలయసంస్థ మాజీ చైర్మన్ నాగరాజుయాదవ్, కౌన్సిలర్లు జక్కుల కృష్ణ, గోపాల్‌రెడ్డి, ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

**అయ్యప్పస్వామి పడిపూజలో..**

గాజులరామారం సర్కిల్, సూరారం డివిజన్ పరిధి, జై దుర్గాభవానీ కాలనీలోని గురుస్వామి గోకుల్ యాదగిరి ఆధ్వర్యంలో జరిగిన అయ్యప్పస్వామి పడిపూజమహోత్సవంలో ఎమ్మెల్యే వివేకానంద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయ్యప్పమాలాదారులతో కలిసి స్వామివారికి పూజలు నిర్వహించారు. వేడుకల్లో సూరారం, సుభాశ్‌నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్, భాస్కర్, వార్డుకమిటీ సభ్యులు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేను సత్కరించిన షాపూర్‌నగర్ ఇంతేజామి కమిటీ..**

సూరారం డివిజన్ పరిధి, షాపూర్‌నగర్‌లోని ఇంతేజామి కమిటీ ప్రతినిధులు శుక్రవారం ఎమ్మెల్యే వివేకానంద్‌ను ఘనంగా సత్కరించారు. షాపూర్‌నగర్‌లోని జామియా మసీదులో జరిగిన సన్మాన కార్యక్రమానికి కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణతో కలిసి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కార్యక్రమంలో కమిటీ అధ్యక్షులు అఫ్లోజ్, సలహాదారులు మహ్మద్ నజీరుద్దీన్, ఉపాధ్యక్షులు మహ్మద్ అమీర్‌ఖాన్, ప్రధాన కార్యదర్శి మహ్మద్ ఒమర్, బీఆర్ఎస్ నేత మహ్మద్ మక్సూద్‌ఆలీ తదితరులు పాల్గొన్నారు.

## కేపీహెచ్‌బీ కాలనీ సీఐగా వెంకన్న



కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 5 : కేపీహెచ్‌బీ కాలనీ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా సీహెచ్.వెంకన్న బాధ్యతలు స్వీకరించారు. ఇటీవలే సీఐ వెంకటేశ్ సస్పెండ్ కాగా.. సీపీ అవినాశ్ మహంతి కేపీహెచ్‌బీ కాలనీ సీఐగా సీహెచ్.వెంకన్నకు కేటాయిస్తూ ఆదేశాలు జారీ చేశారు. కాగా శుక్రవారం వెంకన్న బాధ్యతలు స్వీకరించారు.

## టీపీసీసీ ఉపాధ్యక్షుడు నరేందర్‌రెడ్డికి నూతన సంవత్సర శుభాకాంక్షలు



టీపీసీసీ ఉపాధ్యక్షుడు వెం నరేందర్‌రెడ్డిని టీపీసీసీ సెక్రటరీ సూరజ్‌కుమార్ తివారీ నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. శుక్రవారం నగరంలో నరేందర్‌రెడ్డిని సూరజ్ తివారి మర్యాద పూర్వకంగా కలిసి బొకే అందజేసి నూతన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024 సంవత్సరంలో తెలంగాణ రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని భగవంతుడిని కోరుతున్నట్లు తెలిపారు. భవిష్యత్‌లో మరింత సంతోషంగా ఉండేందుకు దేవుడు కరుణించాలని కోరుతున్నట్లు పేర్కొన్నారు.

– బాలానగర్, జనవరి 5

## ఎంఎల్ఆర్ఐటీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ వెంకటనారాయణకు డాక్టరేట్



దుండిగల్,జనవరి5: దుండిగల్‌లోని మర్రిలక్ష్మన్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ గా పనిచేస్తున్న కాపా వెంకటనారాయణకు డాక్టరేట్ లభించింది. ఈ మేరకు మధ్యప్రదేశ్ సెహోరే లోని శ్రీసత్యసాయి యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ అండ్ మెడికల్ సైన్సెస్ గురువారం ఆయనకు డాక్టరేట్‌ను ప్రకటించింది. వచ్చే నెలలో జరుగనున్న స్నాతకోత్సవంలో ఈ అవార్డును వెంకటనారాయణ అందుకోనున్నట్లు తెలిపారు. కాగా 'కాంపేరటివ్ అనాలసిస్ ఆఫ్ సైకలాజికల్ బిహేవియర్ ఫర్ తెలంగాణ సీనియర్ క్రికెట్ ప్లేయర్స్ బిఫోర్ అండ్ ఆఫ్టర్ కాంపిటీషన్' అనే పరిశోధన పత్రం సమర్పించినందుకు గాను యూనివర్శిటీ ఈ డాక్టరేట్‌ను ప్రకటించినట్లు వెంకటనారాయణ తెలిపారు

## వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి


వైద్య శిబిరంలో తూము శ్రావణ్‌కుమార్‌కు పరీక్షలు చేస్తున్న వైద్యులు

మూసాపేట, జనవరి5: బస్తీల్లో దాతలు, స్వచ్ఛంద సంస్థలు అందజేస్తున్న ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని మూసాపేట డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ అన్నారు. డివిజన్ పరిధిలోని బబ్బుగూడలో ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీ ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరం, ఉచిత మందుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా శ్రావణ్‌కుమార్ హాజరై ప్రారంభించారు. వైద్యులు బీపీ, షుగర్,పరీక్షలతో పాటు ఈసీజీ, కంటి పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తిరుపతి, బస్తీ అధ్యక్షుడు మజీద్‌ఖాన్, బోడ శ్రీనివాస్, రాములు, ఆరుల్, శ్రీధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## కేపీహెచ్‌బీ కాలనీలో అయోధ్య రాముడి అక్షింతల పంపిణీ


కేపీహెచ్‌బీ కాలనీలో అయోధ్య రాముడి అక్షింతలను పంపిణీ చేస్తున్న కట్టా నరసింగరావు తదితరులు

కేపీహెచ్‌బీ కాలనీ, జనవరి 5 : అయోధ్య శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్రం ట్రస్ట్ ఆదేశాల మేరకు కేపీహెచ్‌బీ కాలనీ శ్రీ వేంకటేశ్వర బస్తీ ఆధ్వర్యంలో కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్‌లో ఇంటింటికి తిరిగి శ్రీరాములవారి అక్షింతలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ హిందూ సేవా సమితి అధ్యక్షుడు కట్టా నరసింగరావు మాట్లాడుతూ.. ఈనెల 22న అయోధ్యలో బాలరాముడి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా ప్రతి ఇంట్లో దీపాలు వెలిగించి పూజలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సత్తిరాజు, మహేశ్, రఘురామ్, శంకర్, వరలక్ష్మి, సుజాత, రమాదేవి, విజయ, కోటేశ్వరి, మంజూశ, స్వాతి, గీత, శాంత, రేణుక, నాగలక్ష్మి, లక్ష్మి, సుప్రియ, పద్మ తదితరులున్నారు.

## ఎంఎల్ఆర్ఐటీ కళాశాలలో ప్రాజెక్ట్ ఎక్స్‌పో-2024

దుండిగల్,జనవరి5: నగర శివారు, కుత్బుల్లాపూర్ నియోజవర్గం, దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్ రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో శుక్రవారం ప్రాజెక్ట్ ఎక్స్‌పో నిర్వహించారు. ఎంఎల్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సెంటర్ ఫర్ ఇన్నోవేషన్ అండ్ ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ (ఎంఎల్ఆర్ఐటీ,సీఐఈ) అండ్ హెచ్ఎస్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎక్స్‌పోలో దుండిగల్‌లోని జెడ్‌పీహెచ్ఎస్ విద్యార్థులు, మేడ్చల్‌లోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన సుమారు 200 మంది విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సీఐఈ ఇన్‌చార్జీ డా.వై.బలరాం,హెచ్ అండ్ ఎస్ విభాగాధిపతి అచ్చిరెడ్డి, ఎంఎల్ఆర్ఐటీ కళాశాల ప్రిన్సిపల్ డా.కే,శ్రీనివాసరావు, డైరెక్టర్ మర్రి శ్రేయారెడ్డి, కార్యక్రమ కో-ఆర్డినేటర్లు డా.మనోజ్, డా.పరమేశ్వరీ తదితరులు పాల్గొన్నారు.

## ప్లైవుడ్ షెడ్‌లో అగ్నిప్రమాదం

జగద్గిరిగుట్ట,జనవరి5: డోర్ల తయారీ షెడ్‌లో అగ్నిప్రమాదంతో సామాగ్రి దగ్ధం అయింది. జగద్గిరిగుట్ట పోలీసులు, స్థానికుల వివరాల మేరకు.. గాజులరామారం డివిజన్ ద్వారకానగర్ కమాన్ ఎదురుగా నేమారం చౌదరి ప్లైవుడ్స్ పేరిట కొన్నేళ్లుగా దుకాణం సమీపంలో ప్లైవుడ్ చెక్కతో డోర్లు తయారుచేసే షెడ్ నిర్వహించుకుంటున్నారు. మూసిఉన్న షెడ్‌లోంచి శుక్రవారం మధ్యాహ్నం పొగలు రావడంతో అగ్నిమాపక సిబ్బంది వచ్చి ఫైరింజన్ సాయంతో మంటలు ఆర్పివేశారు. ఈ ఘటనలో షెడ్‌లో నిల్వ ఉంచిన ప్లైవుడ్ కాలిపోయింది.

## ఓఆర్ఆర్‌పై వాహనంలో మంటలు

దుండిగల్,జనవరి5: ఓఆర్ఆర్‌పై బ్లూడార్ట్ డెలివరీ వాహనంలో మంటలు చెలరేగాయి. దుండిగల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హర్యానకు చెందిన (హెచ్ఆర్ 47ఎఫ్-3627) వాహనం ఢిల్లీ నుంచి పార్శిల్‌వస్తువులతో బెంగళూరు వెళుతున్నది. శుక్రవారం దుండిగల్‌లోని 5వ నంబర్ ఎగ్జిట్‌దాటి మల్లంపేట్ దగ్గరకు చేరుకోగానే వాహనం వెనుకవైపు మంటలురావడంతో డ్రైవర్ వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపి అగ్నిమాపక అధికారులకు సమాచారం ఇచ్చారు. ఫైర్‌సిబ్బంది సకాలంలో మంటలను ఆర్పివేశారు.

## వేర్వేరు చోట్ల ముగ్గురు అదృశ్యం


సమ్రీన్‌జబీన్

జగద్గిరిగుట్ట,జనవరి5: వేర్వేరు చోట్ల ముగ్గురు వ్యక్తులు కనిపించకుండా పోయిన సంఘటనలు జగద్గిరిగుట్ట పరిధిలో జరిగాయి. పోలీసుల వివరాలమేరకు.. ఐటీ ఉద్యోగి హబీబ్‌ఖాన్, సమ్రీన్‌జబీన్(20) దంపతులకు 9నెలలక్రితం వివాహం అయింది. గాజులరామారం సమీపం చంద్రగినగర్‌లో నివాసముంటున్నారు. కొంతకాలంగా ఇద్దరినడుమ చిన్నపాటి గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈనెల1న సమ్రీన్‌జబీన్ ఎలాంటి సమాచారంలేకుండా ఇంటినుంచి వెళ్లిపోయింది. ఆమె ఆచూకీ దొరక్కపోవడంతో భర్త ఫిర్యాదుతో కేసు నమోదైంది.

**ఆటో డ్రైవర్..**


సైదులు

వెంకటేశ్వరనగర్‌కు చెందిన ఆటో డ్రైవర్ సైదులు (48) తన వాహనంతో ఈనెల 2న వెళ్లిపోయి తిరిగిరాలేదు. ఫోన్ స్విచ్ ఆఫ్ ఉండడంతో గాలించినా ఫలితం లేకపోయింది. దీంతో అతని భార్య సరోజ పోలీసులను ఆశ్రయించగా కేసు నమోదు చేశారు.

**మరోచోట వృద్ధురాలు..**


వసంతకుమారి

ఆంధ్రప్రదేశ్ విజయనగరం జిల్లా బొబ్బిలికి చెందిన వసంతకుమారి (62) మాధవరంనగర్‌లోని కూతురు వద్ద కొంత కాలంగా ఉంటోంది. నెల 4న ఇంటిలో ఉండాల్సిన ఆమె ఆచూకీ లేకుండా పోయింది. పరిసరాల్లో వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో ఆమె కుమార్తె శ్రీలక్ష్మి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.